సాక్షి
కామారెడ్డి
మంగళవారం । 21 । మార్చి । 2023



మండల క్రీడలకు మంగళం!

కరోనా కారణంగా ఎస్‌జీఎఫ్ పోటీలు నిలిచిపోయాయి. నాలుగైదేళ్లుగా క్రీడలు నిర్వహించడం లేదు.

- 8లో ▸



రసవత్తరంగా కుస్తీ పోటీలు

లింగంపేట మండలంలోని బోనాల్ గ్రామంలో ప్రభుస్వామి ఆలయం వద్ద సోమవారం కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.6 /20.0

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ధరణిలో 11 ప్లాట్లు, ఏడు గృహాల విక్రయం



కామారెడ్డి క్రైం: ధరణి టౌన్‌షిప్‌లో సోమవారం 11 ప్లాట్లు, ఏడు గృహాలు విక్రయించినట్లు కలెక్టరేట్ పాలనాధికారి రవీందర్ తెలిపారు. టౌన్‌షిప్‌లోని గృహాలకు కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. ధరణి టౌన్‌షిప్‌లోని వివిధ దశల్లో నిర్మాణం పూర్తయిన గృహాల వేలానికి నేడు ఆఖరి రోజు అని పేర్కొన్నారు. సోమవారం వేలం పాటలో 11 ప్లాట్లు, ఏడు గృహాలు విక్రయించడం ద్వారా ప్రభుత్వానికి రూ. 2.35కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. వేలం పాటలో గృహం కొనుగోలు చేసిన వారు మొదటి 7 రోజుల్లోగా కొనుగోలు చేసిన ఇల్లు మొత్తం విలువలో 33 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. కొనుగోలు చేసిన రోజు నుంచి 45 రోజుల్లోగా మొత్తం విలువలో రెండో విడతగా 33 శాతం చెల్లించాలన్నారు. మిగతా మొత్తాన్ని 90 రోజుల్లోగా చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజీవ్ స్వగృహ ఏజీఎం సత్యనారాయణ, అధికారులు రాందాస్, సాయి భుజంగరావు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు ఇప్పించాలి



కామారెడ్డి క్రైం: డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పించాలని కోరుతూ మహిళలు పెద్ద ఎత్తున కామారెడ్డి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. అనివార్య కారణాలతో సోమవారం నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు రద్దు చేశారు. దీంతో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం వినతులు, ఫిర్యాదులు చేసేందుకు వచ్చిన మహిళలను ప్రధాన గేటు వద్దే పోలీసులు అడ్డుకున్నారు. అక్కడే ఓ అధికారిని ఏర్పాటు చేసి డబుల్ బెడ్‌రూం ఇళ్ల వినతుల కోసం వచ్చిన మహిళల వివరాలను నమోదు చేసుకుని పంపించారు. అర్హుల జాబితాలో ఉన్నప్పటికీ ఇటీవల జరిగిన కేటాయింపుల్లో తమకు అన్యాయం జరిగిందని మహిళలు ఆరోపించారు. అధికారుల తీరుపై మండిపడ్డారు.

24, 25 తేదీల్లో జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా పరిషత్ స్థాయీసంఘ సమావేశాలను ఈనెల 24, 25వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో డి.సాయాగౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 24న శుక్రవారం గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, పనులు, ఆర్థికం, ప్రణాళిక, 25న శనివారం సాంఘిక సంక్షేమం, మహిళా, శిశుసంక్షేమం, వ్యవసాయం స్థాయీ సంఘ సమావేశాలుంటాయని పేర్కొన్నారు. సభ్యులు, సంబంధిత జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని సీఈవో సాయాగౌడ్ కోరారు.

ఆర్టీసీ కార్గోలో సీతారాముల కల్యాణ తలంబ్రాలు



కామారెడ్డి టౌన్: తెలంగాణ ఆర్టీసీ సంస్థలోని కార్గో లాజిస్టిక్స్ సేవల ద్వారా సీతారాముల కల్యాణ తలంబ్రాలు బుక్ చేసుకోవచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సోమవారం ఆయన తలంబ్రాలను బుక్ చేసుకున్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్‌తో పాటు ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తలంబ్రాలను బుక్ చేసుకున్నారు. ఆర్టీసీ సిబ్బంది రాజు, ఎస్ఎస్ గౌడ్‌లు రశీదులను వారికి అందజేశారు. తలంబ్రాల బుకింగ్ కోసం 9154298730 నంబరును సంప్రదించాలని కోరారు.

5,299 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో సోమవారం జరిగిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 5,299 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 737 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఇంకా అవసరమైన 759 మందికి సంబంధించిన అద్దాలను ఆర్డర్ చేసినట్లు అధికారులు తెలిపారు.

కేసీఆర్ సర్కారును

ఇంటికి పంపిద్దాం

- రుణమాఫీ చేయక రైతుల అప్పులు రెండింతలయ్యాయి
- బ్యాంకోళ్లు నిజాం కాలంలో లాగా జప్తు చేస్తున్నారు
- దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వరు
- ఉద్యోగాల్లేవు, నిరుద్యోగ భృతి రాదు
- నోటిఫికేషన్లంటూ ప్రశ్నాపత్రాలు అమ్ముకుంటున్నారు
- బాన్సువాడ సభలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



బాన్సువాడ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి, పాల్గొన్న షబ్బీర్‌అలీ, సొదాగర్ గంగారాం

సాక్షి, కామారెడ్డి/బాన్సువాడ టౌన్/నస్రుల్లాబాద్: రైతులు బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు మాఫీ చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని, లక్షన్నర ఉద్యోగాలిస్తానని నమ్మించి మోసం చేసిన కేసీఆర్ సర్కారును ఇంటి పంపేందుకు ప్రజలు సిద్ధం కావాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా జిల్లాలో మూడో రోజైన సోమవారం బాన్సువాడ నియోజకవర్గంలోని నస్రుల్లాబాద్ మండల కేంద్రం నుంచి బొమ్మన్‌దేవ్‌పల్లి చౌరస్తా, కాంశెట్టిపల్లి, నెమ్లి, అంకోల్ క్యాంప్, దుర్కి, దేశాయిపేట చౌరస్తా, సోమేశ్వర్ గ్రామాల మీదుగా బాన్సువాడ పట్టణానికి పాదయాత్ర నిర్వహించారు. మధ్యాహ్నం పొతంగల్ మండలం సుంకిని గ్రామానికి వెళ్లి వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం సాయంత్రం బాన్సువాడ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేయకపోవడంతో అప్పులు పెరిగిపోయాయని, అప్పు చెల్లించడం లేదంటూ సహకార బ్యాంకు అధికారులు రైతుల ఇళ్లకు వెళ్లి నిజాం కాలంలో లాగా వస్తువులను తీసుకువెళ్తున్నారంటే బాన్సువాడ ప్రాంతంలో అరాచకం ఎలా నడుస్తుందో కనబడుతుందన్నారు. ఇసుక, కంకరను లూటీ చేస్తున్నారని ఆరోపించారు.

రైతుగా చెప్పుకునే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కొడుకు చైర్మన్‌గా ఉన్న బ్యాంకు అధికారులే రజాకార్ల లాగా ఊళ్ల మీద పడుతున్నారని పేర్కొన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తానని, పంటలకు గిట్టుబాటు ధర ఇస్తానని, నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తానని, ఉపాధి కల్పిస్తానని, ఉద్యోగాలు వచ్చే వరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ. 3,016 ఇస్తానన్న ముఖ్యమంత్రి అన్ని వర్గాల వారిని మోసం చేశారని, అందుకే అందరూ ఒక్కటై సాగనంపాలన్నారు. 2021లో పదిలక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిని పదిహేను నెలలైనా పరిహారం ఎందుకు ఇప్పించలేదని నిలదీశారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ఆదుకునే దిక్కులేదన్నారు. రైతులు పండించిన వడ్లు చివరి గింజ వరకు కొంటానని చెబితే రైతులంతా వరి పండించారని, తర్వాత వరి వేస్తే ఉరి అంటూ సీఎం కేసీఆర్ మాట్లాడిన మాటలను రైతులు మరిచిపోవద్దన్నారు. రైతులను మోసం చేసిన కేసీఆర్‌ను ఉరివేయాలని, పోచారంను పాతాళానికి తొక్కాలన్నారు. గిరిజనులు, మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లు ఇస్తామని మోసం చేశారని ఆరోపించారు. గిరిజనులకు అసైన్డ్ పట్టాలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. తొమ్మిదేళ్లుగా ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేసిన ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చి, ప్రశ్నాపత్రాలు అమ్ముకుందని ఆరోపించారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న సర్కారుకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణమాఫీ

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, అందరి కష్టాలు తీరుస్తుందని రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. రైతుల రుణాలను రూ. 2 లక్షలు మాఫీ చేస్తామని, ఇళ్లు లేని పేదలకు రూ. 5 లక్షలు ఇస్తామని, వైద్యం కోసం రాజీవ్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ. 5లక్షల వరకు అండగా ఉంటామని తెలిపారు. గ్యాస్ సిలిండర్ రూ. 5 వందలకే ఇస్తామని పేర్కొన్నారు. సభలో మాజీ మంత్రులు షబ్బీర్‌అలీ, సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీలు అంజన్‌కుమార్ యాదవ్, సిరిసిల్ల రాజయ్య, సురేశ్‌షెట్కార్, మాజీ ఎమ్మెల్యే గంగారాం, కాంగ్రెస్ నేతలు కాసుల బాల్‌రాజు, కైలాస్ శ్రీనివాస్, మానాల మోహన్‌రెడ్డి, గడుగు గంగాధర్, కేశ వేణు, నగేశ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో రేవంత్‌రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

హైదరాబాద్‌కు రేవంత్‌రెడ్డి పయనం

జిల్లాలో గత మూడు రోజులుగా హాథ్ సే హాథ్ జోడోయాత్ర నిర్వహించిన పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సోమవారం రాత్రి బాన్సువాడ సభ ముగిసిన అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. పండుగల నేపథ్యంలో మూడు రోజుల పాటు విరామం ప్రకటించారు. ఈ నెల 25న జుక్కల్ నియోజకవర్గంలో తిరిగి యాత్ర కొనసాగనుందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.



హాథ్ సే హాథ్ జోడోయాత్రలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి, పార్టీ నాయకులు

బీఆర్ఎస్, బీజేపీలపై కాంగ్రెస్ చార్జ్‌షీట్



చార్జ్‌షీట్‌ను విడుదల చేస్తున్న మల్లురవి

బాన్సువాడ టౌన్: బాన్సువాడ నియోజవర్గంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రలో భాగంగా కాంగ్రెస్ టీపీసీసీ వైస్ చైర్మన్ మల్లు రవి బీఆర్ఎస్, బీజేపీలపై చార్జ్‌షీట్ విడుదల చేశారు. పాదయాత్ర మధ్యాహ్నం విరామం సమయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు తోడు దొంగలంటూ బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై రెండు పేజీల చార్జ్‌షీట్‌ను విడుదల చేశారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిపై పలు ఆరోపణలు చేశారు. సమావేశంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కాసుల బాల్‌రాజ్, నాయకులు గడుగు గంగాధర్, అజీం, అఫ్రోజ్, సాయాగౌడ్, ప్రతాప్‌సింగ్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

టికెట్లు ఖరారు చేసేది అధిష్టానమే..



విలేకరులతో మాట్లాడుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్ రావు

- నిర్ణయించే అధికారం మరెవరికీ లేదు
- నాకు ఏఐసీసీయే అధిష్టానం
- పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు ధిక్కార స్వరం

సాక్షి, కామారెడ్డి: కాంగ్రెస్ పార్టీలో ఎవరో ఒకరు అభ్యర్థులను నిర్ణయించే అధికారం లేదని ఏఐసీసీ నిర్ణయించిన అభ్యర్థులే పోటీలో ఉంటారని పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు అన్నారు. సోమవారం ఆయన తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యటన జిల్లాలో కొనసాగుతున్న సమయంలో ఆయన ధిక్కార స్వరం వినిపించడం కలకలం రేపింది. హాథ్‌సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారిలో ఆదివారం జరిగిన సభలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఎల్లారెడ్డి అభ్యర్థిత్వం విషయంలో ఈ ప్రాంతానికి చెందిన సీనియర్ నేత షబ్బీర్ అలీ చూసుకుంటారని ప్రకటించిన విషయం తెలిసిందే. పీసీసీ చీఫ్ ప్రకటనతో ఎల్లారెడ్డి టిక్కెట్‌పై మదన్‌మోహన్ అనుచరులు ఒకింత ఆందోళనకు గురయ్యారు. దీంతో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కాంగ్రెస్‌లో షబ్బీర్‌అలీకి ఏ హోదా ఉందని ప్రశ్నించారు. సొంత నియోజకవర్గంలో గెలవలేని షబ్బీర్‌అలీ అభ్యర్థులను ఎలా నిర్ణయిస్తాడన్నారు. కష్టపడ్డ వాళ్లకే టికెట్లు ఇస్తామని వరంగల్ సభలో రాహుల్‌గాంధీ మాట్లాడిన మాటలను ఆయన వినిపించారు. కాంగ్రెస్ ఎవరి సొత్తు కాదని కష్టపడ్డ వారికే టికెట్ వస్తుందని పేర్కొన్నారు. తాను నిరంతరం ప్రజల్లో ఉంటూ సొంత ఆస్తులను అమ్ముకుని సేవ చేస్తున్నానని తెలిపారు. నూటికి నూరుశాతం ఎల్లారెడ్డి టికెట్ తనకే వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌లో మూడు సార్లు ఓడిపోయిన వారికి టికెట్ ఇవ్వొద్దనే చర్చ జరిగిందని ఈ లెక్కన షబ్బీర్ అలీకే టికెట్ రాదని తెలిపారు. షబ్బీర్‌అలీకి ఎల్లారెడ్డితో ఎలాంటి సంబంధం లేదన్నారు. షబ్బీర్‌అలీ కామారెడ్డిలో గెలవడం కోసం ప్రయత్నం చేయకుండా ఎల్లారెడ్డి నియోజకవర్గం పార్టీ శ్రేణుల్లో అయోమయం సృష్టిస్తున్నారని ఆరోపించారు. షబ్బీర్‌అలీ ఇప్పిస్తున్న స్టేట్‌మెంట్లు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగిస్తాయన్నారు. అధిష్టానం తనను కాదంటే తప్పు కుంటాను కానీ షబ్బీర్‌అలీ చెబితే ఎందుకు తగ్గుతానని పేర్కొన్నారు. నాకు అధిష్టానం ఏఐసీసీ మాత్రమేనన్నారు. తనకు టికెట్ వస్తుందని ఎల్లారెడ్డి నుంచి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి..

కలెక్టర్ జితేష్ వి పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పాల్గొన్న అధికారులు

కామారెడ్డి క్రైం: జిల్లాలోని పౌరులందరూ తప్పనిసరిగా ఆధార్ నవీకరణ చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 5–15 ఏళ్ల వయస్సు పిల్లలకు ఆధార్ కేంద్రంలో ఎలాంటి చార్జీలు ఉండవని పేర్కొన్నారు. జిల్లాలోని మీసేవ, ఆధార్ కేంద్రాలను తనిఖీలు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, పౌర సేవలను పొందాలంటే తప్పనిసరిగా ఆధార్ నవీకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. 2016 కంటే ముందు ఈ గుర్తింపు కార్డు పొందిన వారందరూ యుఐడీఏఐ ఆదేశాల ప్రకారం సంబంధిత పత్రాలతో మీసేవ కేంద్రాలను సంప్రదించాలన్నారు. ఈ నవీకరణ ప్రక్రియకు సంబంధించిన తగిన చర్యలు తీసుకోవాలని ఈ డిస్ట్రిక్ మేనేజర్ ప్రవీణ్ కుమార్‌ను ఆదేశించారు. వివిధ ఉద్యోగాల దరఖాస్తులు, బ్యాంకు ఖాతాలు, ధ్రువపత్రాలు, స్థలాల రిజిస్ట్రేషన్, సిమ్ కార్డు తీసుకునేందుకు, రేషన్ కార్డు పొందడం లాంటి అనేక రకాల సేవలు సులభంగా పొందాలంటే ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఓటరు గుర్తింపు కార్డు వివరాలను కూడా ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఎల్డీఎం చిందం రమేశ్, యూఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ వినయ్ పాల్గొన్నారు.

పల్లె దవఖానాలకు రంగులు వేయండి

కామారెడ్డి క్రైం: జిల్లాలోని 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 106 పల్లె దవాఖానాలు మంజూరు కాగా వాటిలో ఇప్పటివరకు 62 పల్లె దవాఖానాలకు రంగులు వేసే పనులను అధికారులు పూర్తి చేయించారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సోమవారం అధికారులతో పల్లె దవాఖానాలకు రంగులు వేయడంపై జూమ్ మీటింగ్ నిర్వహించారు. పల్లె దవాఖానాలకు ఎంపిక చేసిన 37 ప్రభుత్వ, 25 ప్రైవేటు భవనాలకు రంగులు వేశారని వెల్లడించారు. మరో 14 ప్రభుత్వ భవనాలు, 30 ప్రైవేటు భవనాలకు రంగులు వేయాల్సి ఉందన్నారు. వాటిని వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, ప్రోగ్రాం అధికారులు శోభారాణి, చంద్రశేఖర్, శిరీష, పద్మజ, చలపతి పాల్గొన్నారు.

దళితబంధు విజయగాథలను గుర్తించాలి

నిజాంసాగర్(జుక్కల్): దళితుల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం విజయగాథలను గుర్తించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో దళిత బంధు పథకంపై పంచాయతీ అధికారులు, ఆయాశాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బంధు పథకానికి నిజాంసాగర్ మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా గుర్తించి 1,298 మంది లబ్ధిదారులకు రూ. 10లక్షల చొప్పున యూనిట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. దళిత బంధు యూనిట్లు పొందిన లబ్ధిదారులు యదార్థ గాథలను గ్రామాల వారీగా గుర్తించాలన్నారు. యూనిట్ల వారీగా లబ్ధిదారులు సాధిస్తున్న లక్ష్యాలను ఎంపిక చేసుకొని పుస్తకాన్ని తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితులు, యూనిట్ల వల్ల లబ్ధి పొందుతున్న తీరు తెన్నులను వారి మాటల్లో పుస్తక ప్రదర్శన చేయాలన్నారు. మిగతా మండలాల్లో దళిత బంధు వర్తింపునకు రోల్‌మోడల్‌గా ఉండాలని సూచించారు. సమావేశంలో దళిత బంధు కమిటీ అధ్యక్షుడు గైని విఠల్, అసిస్టెంట్ కలెక్టర్ వెంకటేశ్‌ధోత్రే, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ భరత్, జిల్లా మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీవాణి పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- పేపర్ లీకేజీ దోషులను కఠినంగా శిక్షించాలి
- బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార

నిజాంసాగర్(జుక్కల్): టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బిచ్కుందలో పేపర్ లీకేజీపై బీజేపీ ఆధ్వ ర్యంలో నియోజకవర్గ స్థాయి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రూప్–1తో పాటు ఇతర పేపర్లు లీకేజీ కావడంతో వాటిని రద్దు చేయడంతో పాటు ఒక్కొక్క విద్యార్థికి రూ. లక్ష చొప్పున ప్రభుత్వం చెల్లించాలన్నారు. పేపర్ లీకేజీకి కారణమైన వారితో పాటు మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు అరుణతార

981 ఎకరాల్లో పంట నష్టం

కామారెడ్డి క్రైం: జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలులు, వడగళ్లకు ఇప్పటివరకు 981.2 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. గాంధారి, లింగంపేట, దోమకొండ, భిక్కనూరు, రాజంపేట తదితర మండలాల పరిధిలో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆదివారం కూడా పలుచోట్ల వర్షం పడింది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వ్యవసాయశాఖ అధికారులు పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారిణి భాగ్యలక్ష్మి సోమవారం తెలిపారు. జిల్లాలో అకాల వర్షాలకు వరి, మొక్కజొన్న, పంటకు చాలా చోట్ల నష్టం వాటిల్లింది. మామిడి తోటల్లో కాయలు రాలి రైతులు నష్టపోయారు. జిల్లావ్యాప్తంగా 328.2 ఎకరాల్లో వరి, 615 ఎకరాల్లో మొక్కజొన్న, 38 ఎకరాల్లో గోధుమ పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. మొత్తం 1,153 మంది రైతుల పంటలు దెబ్బతిన్నాయి.



గాంధారి మండలంలో నేలకొరిగిన మక్క పంటను పరిశీలిస్తున్న డీఏవో భాగ్యలక్ష్మి

క్లుప్తంగా

గ్రంథాలయంలో మధ్యాహ్న భోజనం ప్రారంభం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులకు సోమవారం సంస్థ జిల్లా చైర్మన్ పి రాజేశ్వర్, ఆర్డీవో శ్రీనివాసులు మధ్యాహ్నం భోజనం ప్రారంభించారు. అభ్యర్థులు అధైర్యపడకుండా మళ్లీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ ఎం రాజన్న, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నిజామాబాద్అర్బన్: ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఫస్టియర్ గణితం-1ఏ, రాజనీతి శాస్త్రం, బోటని పరీక్షలు జరిగాయి. ఉర్దూ మీడియం గణితం పేపర్‌లో ఒక ప్రశ్న తప్పుగా వచ్చింది. జిల్లావ్యాప్తంగా 951 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో రఘురాజ్ తెలిపారు. డీఐఈవో పలు కేంద్రాలను తనిఖీ చేశారు.

కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన ఇంటర్ ఫస్ట్ పరీక్షలకు 9771 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 10,306 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 535 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలకు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పర్యవేక్షించారు. 11 మంది విద్యార్థులు ఓఎంఆర్ షీట్‌పై వివరాలు రాయలేరని తెలిపారు.

24, 25న బీఈడీ ప్రాక్టికల్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీఈడీ మొదటి సెమిస్టర్ విద్యార్థులకు ఈ నెల 24, 25 తేదీల్లో ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఎం అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫేజ్-1 కళాశాలలకు చెందిన విద్యార్థులకు 24న, ఫేజ్ -2 కళాశాలల విద్యార్థులకు 25న పరీక్షలు జరుగుతాయని వివరించారు.

25లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫీజును ఈ నెల 25 వరకు చెల్లించవచ్చని కంట్రోలర్ ఎం.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో 27 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

మండల క్రీడలకు మంగళం!

- 2018 నుంచి నిలిచిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు
- ఆటలకు దూరమై ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



ఖో ఖో ఆడుతున్న గురుకుల విద్యార్థులు(ఫైల్)

బాన్సువాడరూరల్: విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో.. ఆటలు కూడా అంతే అవసరం.. క్రీడా పోటీల్లో పాల్గొనడంతో పోటీతత్వం, స్నేహభావం పెరగడంతో పాటు శారీరక , మానసిక ఎదుగుదల ఉంటుంది. ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు అవకాశం దొరికినప్పుడల్లా చెబుతుంటారు. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం అమలుకు చర్యలు తీసుకోలేకపోవడంతో విద్యార్థులు తరగతి గదులకే పరిమితమవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిత్యం పుస్తకాలతో కుస్తీపడుతూ నాలుగు గోడల మధ్య నలిగిపోతున్నారు.

నాలుగైదు ఏళ్లుగా..

నాలుగైదేళ్లుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించడం లేదు. ఈ పోటీలు నిర్వహించడంతో పాఠశాల స్థాయి నుంచి మండల స్థాయికి, అక్కడి నుంచి జిల్లా స్థాయికి, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటే అవకాశం కలుగుతుంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన వారికి స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లు వర్తించే సర్టిఫికేట్లు కూడా జారీచేస్తారు. కానీ కరోనా పుణ్యమా అని ఎస్‌జీఎఫ్ పోటీలు నిలిచిపోయాయి. రెండేళ్లుగా కరోనా భయం లేకుండా పాఠశాలలు కొనసాగుతున్నా ఉన్నతాధికారులు ఎస్‌జీఎఫ్ గురించి ఊసెత్తటం లేదు. దీంతో పాఠశాల విద్యార్థుల ప్రతిభ బయటపడే ఆస్కారం లేకుండా పోతోంది.

గతంలో ఎస్‌జీఎఫ్ పోటీలతో సంబంధం లేకుండా మండల స్థాయిలో పాఠశాల విద్యార్థులకు క్రీడలు నిర్వహించేవారు. దీనికోసం ఆయా మండలాల ఎంఈవోలు, ప్రజాప్రతినిధులు బాధ్యతగా తీసుకుని టోర్నమెంట్‌ను విజయవంతం చేసేవారు. ప్రస్తుతం మండలస్థాయిలోనూ పాఠశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించడం లేదు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివుకునే ప్రతిభ కలిగిన క్రీడాకారులు బయటపడలేక పోతున్నారు. పలుచోట్ల అసోసియేషన్‌లు, ఫౌండేషన్‌లు, స్మారక పోటీలు తప్పా ద్దమొత్తంలో విద్యార్థుల భాగస్వామ్యం ఉండే పోటీలు కరువయ్యాయి.

సత్తా చాటాలని ఉంది



మండల, జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొని సత్తా చాటాలని ఉంది. కానీ కొన్నేళ్లుగా క్రీడా పోటీలు నిర్వహించడం లేదు. ప్రస్తుతం పరీక్షలు దగ్గర పడ్డాయి. వచ్చే విద్యాసంవత్సరంలోనైనా పోటీలు నిర్వహిస్తే బాగుంటుంది.

– సిద్దార్థ, విద్యార్థి, బోర్లం

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి



చదువుకు ఎంత ప్రాముఖ్యత ఇస్తున్నామో అంతే ప్రాధాన్యత క్రీడలకూ ఇవ్వాలి. కరోనాతో ఎస్‌జీఎఫ్ పోటీలు నిలిచిపోయాయి. గతంలో కొత్తాబాది హైస్కూల్ విద్యార్థులు ఎస్‌జీఎఫ్‌లో ప్రతిభ కనబర్చి వాలీబాల్ విభాగంలో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నారు.

– సురేందర్, పీఈటీ, కొత్తాబాది

ప్రభుత్వం ఆదేశిస్తే నిర్వహిస్తాం



ప్రభుత్వం నిర్ణయం తీసుకుని, బడ్జెట్ కేటాయించినట్లయితే రాష్ట్రవ్యాప్తంగా 33జిల్లాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తారు. కానీ కరోనా సమయం నుంచి నేటి వరకు ఎలాంటి పోటీలు నిర్వహించలేదు. అసోసియేషన్, ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో పలుచోట్ల పోటీలు జరుగుతున్నాయి.

– రాజు, డీఈవో, కామారెడ్డి

పిల్లలపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలి

నిజామాబాద్ సిటీ: జిల్లాలో పిల్లలు, యువకులు మత్తు పదార్థాలకు బానిస అవుతున్నారని, పిల్లల అలవాట్లపై తల్లిదండ్రులు నిఘా పెట్టాలని సీపీ నాగరాజు సూచించారు. సోమవారం నగరంలోని ఖిల్లారోడ్డు బర్కత్‌పుర రోటరీ కార్యాలయంలో రోటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రోటరీ డైలీ క్లినిక్ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని సీపీ ప్రారంభించారు. గంజాయి బానిసలు, బైక్ చోరీలకు పాల్పడుతున్న దాదాపు 300 యువకులను వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇప్పించామన్నారు. మత్తు పదార్థాల నివారణకు మానసిక వైద్యుడు విశాల్‌తో కౌన్సెలింగ్ ఇప్పించినట్లు చెప్పారు. సీపీఆర్‌పై పోలీసులకు అవగాహన కల్పించేందుకు త్వరలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఓ కార్యక్రమం చేయాలని సీపీ కోరారు. అనంతరం క్లబ్ అధ్యక్షుడు సతీష్ సాహు మాట్లాడుతూ ఆల్కహాల్, గుట్కా, కల్లు, గంజా, జర్దా, తంబాకు, కొకైన్ మాన్పించడానికి డైలీ క్లినిక్‌లో వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. మహిళా ఆరోగ్య సమస్యలపై డాక్టర్ కవితారెడ్డి తనవంతు సహకారం అందిస్తారని పేర్కొన్నారు. రోటరీ డైలీ క్లినిక్‌లో చికిత్స పొందాలనుకునేవారు 9246990055, 9908120261 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. క్లబ్ కార్యదర్శి విశాల్ ఆకుల, కోశాధికారి డాక్టర్ హరీష్ స్వామి, ప్రసన్నకుమారి, విజయరావు, శ్రీనివాసరావు, డాక్టర్ నవీన్ మాలు, కవితారెడ్డి, దర్శన్ సింగ్ సోకి, జుగల్‌సోనీ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీపీ నాగరాజు, తదితరులు

రసవత్తరంగా కుస్తీ పోటీలు



లింగంపేట: మండలంలోని బోనాల్ గ్రామంలో ప్రభుస్వామి ఆలయం వద్ద సోమవారం కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. టెంకాయ కుస్తీ నుంచి వెండి కడెం కుస్తీ వరకు పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుశీల, ఉపసర్పంచ్ పరంధాములు, సాయాగౌడ్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



మాచారెడ్డి: మండలంలోని పాల్వంచ ఉన్నత పాఠశాలలో 2000-01 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సోమవారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. 23ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం అప్పటి గురువులు దేవేందర్ రెడ్డి, వీరభద్రయ్య, దయానంద్, బాల్‌రాజు, పంచశీల, స్వర్ణలతలను పూర్వ విద్యార్థులు సత్కరించారు.

విద్యార్థులకు 24 గంటల వైద్య సేవలు



తెయూ(డిచ్‌పల్లి): క్యాంపస్ విద్యార్థులకు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి 24 గంటలు నాణ్యమైన వైద్య సేవలందించాలని తెలంగాణ యూనివర్సిటీ వీసీ డి రవీందర్ సూచించారు. తెయూ క్యాంపస్ హెల్త్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన ల్యాబ్‌ను సోమవారం వీసీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన యంత్రాల ద్వారా బయోకెమికల్ అనలైజర్, ఎలక్ట్రోలైట్ అనలైజర్, సెల్ కౌంటర్ మిషన్, సెంట్రిఫ్యూజ్, బ్లడ్ మిక్సర్ పరీక్షలు నిర్వహించవచ్చన్నారు. అవసరమైన విద్యార్థులు ల్యాబ్ సేవలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం వైద్య సిబ్బంది వీసీకి రక్తపరీక్షలు చేశారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ విద్యావర్ధిని, హెల్త్ సెంటర్ వైద్యురాలు అనూష పాల్గొన్నారు.

22 వరకు రేషన్ బియ్యం పంపిణీ

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న ఉచిత బియ్యం పంపిణీ ఈ నెల 22 వరకు కొనసాగుతుందని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గౌరిశెట్టి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోని వారు ఉంటే సంబంధిత రేషన్ షాపులలో తీసుకోవాలని ఆయన కోరారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఖలీల్‌వాడి:హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు విధిస్తూ నిజామాబాద్ రెండో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఇన్‌చార్జి జడ్జి షౌకత్ జహాన్ సిద్దీఖీ సోమవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. ఆర్మూర్ పట్టణంలోని మహాలక్ష్మి నగర్‌కు చెందిన దండేవాడ లక్ష్మణ్, హైదరాబాద్‌లోని మౌలాలికి చెందిన పల్లపు కుమార్, బోధన్ మండలం జాడి జమాల్పూర్ గ్రామానికి చెందిన బోడ సాయితేజ కలిసి దొంగతనాలు చేసేవారు. వీరు దొంగిలించిన ఓ బైక్‌ను అమ్మగా రూ.18 వేలు వచ్చాయి. ఆ డబ్బును ముగ్గురు పంచుకోవాలని నిర్ణయించారు. కానీ లక్ష్మణ్ సాయితేజకు రూ.ఆరు వేలు ఇవ్వలేదు. దీంతో సాయితేజ ఈ విషయాన్ని పోలీసులకు చెబుతానని బెదిరించడంతో ఆయనను చంపాలని మిగతా ఇద్దరు నిర్ణయించుకున్నారు. పథకం ప్రకారం సాయితేజను 2021 సెప్టెంబర్ 28న మాక్లూర్ మండలం మామిడిపల్లి అటవీప్రాంతంలోకి తీసుకెళ్లి సాక్ష్యాలు లేకుండా చేశారు. పోలీసులు నేరానికి సంబంధించిన సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో జడ్జి ప్రధాన నిందితుడు లక్ష్మణ్‌కు హత్యానేరం కింద జీవిత ఖైదు, సాక్ష్యాలు చెరిపి వేసినందుకు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తున్నట్లు తీర్పులో పేర్కొన్నారు. రెండో ముద్దాయి పల్లపు కుమార్ పరారీలో ఉన్నాడు. పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కవిత రెడ్డి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

గుండెపోటుతో ఖైదీ మృతి



ఇబ్రహీం మృతదేహం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ నగర శివారులోని సారంగపూర్‌లోని జిల్లా జైలులో ఆదివారం గుండెపోటుతో ఖైదీ మృతి చెందాడు. మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలోని సుల్తాన్‌పూర్ గ్రామం వెల్‌గన్ రోడ్డుకు చెందిన ఇబ్రహీం మహబూబ్(69)కు ఖమ్మం కోర్టు మొదటి అడిషనల్ సెషన్స్ జడ్జి 2014 అక్టోబర్ 1న గంజాయి కేసులో పదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధించారు. ఇబ్రహీం మహబూబ్‌ను ఖమ్మం పోలీసులు వరంగల్ జైలుకు తరలించారు. వరంగల్ జైలును తీసివేయడంతో 2021 జూన్ 5న నిజామాబాద్ జిల్లా జైలుకు తీసుకొచ్చారు. శనివారం రాత్రి తోటి ఖైదీలతో మాట్లాడి పడుకున్న ఇబ్రహీం గుండెపోటు రావడంతో మృతి చెందాడు. ఆదివారం ఉదయం ఇబ్రహీం నిద్రలేకపోవడంతో తోటి ఖైదీలు జైలు సిబ్బందికి సమాచారం అందించారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ ప్రమోద్ ఆరో టౌన్ ఎస్సై సాయికుమార్‌గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. కస్టోడీయల్ మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రూ.మూడు కోట్లతో ఉడాయించిన వ్యాపారి

కామారెడ్డి టౌన్: ఫైనాన్స్, చిట్టీల వ్యాపారం చేస్తున్న ఓ వ్యక్తి రూ.మూడు కోట్లతో ఉడాయించిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పలువురు బాధితులు తెలిపిన ప్రకారం.. కామారెడ్డిలోని అయ్యప్ప నగర్‌లో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి కొంత కాలంగా ఫైనాన్స్, చిట్టీల వ్యాపారం చేస్తున్నాడు. మిత్తిలకు, రోజువారిగా ఫైనాన్స్ ఇచ్చేవాడు. చిరువ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఇలా చాలా మంది ఆయన వద్ద చిట్టీలు వేసేవారు. కొందరు ఉద్యోగులు అతనికి మిత్తిలకు రూ.లక్షల్లో ఇచ్చిన్నట్లు తెలిసింది. కాగా ఆయన సుమారు రూ.మూడు కోట్లతో ఉడాయించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆ వ్యాపారి బెంగళూరులో ఉన్నట్లు సమాచారం. బాధితులు అతని కోసం గాలిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



బాన్సువాడరూరల్: మండలంలోని తాడ్కోల్ శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో కోటగిరి మండలం బస్వాపూర్‌కు చెందిన లక్ష్మణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. తన మిత్రుడు రాముతో కలిసి బైక్‌పై వెళ్తుండగా వీరిని లారీ ఢీకొట్టింది. గాయపడిని ఇద్దరు యువకులను 108 వాహనంలో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. రాముకు స్వల్పగాయాలు కాగా లక్ష్మణ్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

ఎల్లారెడ్డిరూరల్: జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన పటేల్ లక్ష్మి (30)కి ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాలతో ఆమె నాలుగేళ్లుగా పుట్టింట్లోనే ఉంటోంది. అనారోగ్య సమస్యలతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి పోశయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

బూరుగుపల్లికి చెందిన వృద్ధుడు..



జయరాం(ఫైల్)

పెద్దకొడప్‌గల్: మానసిక పరిస్థితి బాగలేనందునా జీవితంపై విరక్తి చెందిన వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని బూరుగుపల్లి గ్రామనికి చెందిన కాంబ్లే జయరాం(70) శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు జయరాం కుమారుడు విఠల్ ఫిర్యాదు చేశారని ఎస్సై కోనారెడ్డి తెలిపారు.

మద్యం మత్తులో యువకుడు..



నరేందర్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: మద్యం మత్తు, క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం లింగాపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సంగి నరేందర్ (19) ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో అతని కుటుంబసభ్యులు మందలించారు. మనస్తాపానికి గురైన అతడు కొద్దిసేపటి తర్వాత క్షణికావేశంలో ఇంటి వెనుక ఉన్న బావిలో దూకాడు. కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు గమనించి బయటకు తీశారు. అప్పటికే అతడు మృతి చెందాడు. దేవునిపల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

మాక్లూర్: ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని రాంచంద్రపల్లిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై యాదగిరిగౌడ్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా పామూరుకు చెందిన రమేష్(55) కుటుంబంతో సహా వచ్చి కొంతకాలంగా ఈ ప్రాంతంలో తాపీ మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కొన్నిరోజులుగా రాంచంద్రపల్లిలో పనులు చేస్తున్నాడు. ఆదివారం రాత్రి భోజనం చేసిన అనంతరం బహిర్భూమికని బయటకు వెళ్లిన రమేష్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి సమీపంలో ఉన్న నీటి కుంటకు వెళ్లి చూడగా అక్కడ రమేష్ (55) పడి ఉన్నాడు. మద్యం తాగి ఉండటంతో బోర్లా పడి ఊపిరి ఆడక మృతి చెంది ఉంటాడని ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు పవన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..



భిక్షపతి (ఫైల్)

రాజంపేట: చెరువులో పడి అనుమానాస్పదంగా ఒకరు మృతి చెందిన ఘటన రాజంపేటలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గడ్డల భిక్షపతి (48) శనివారం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం చెరువులో ఆయన మృతదేహం తేలింది. భిక్షపతికి చేపలు పట్టే అలవాటు ఉందని, ఈ విషయంలో గతంలో బెస్త సంఘం వారు బెదిరించారని మృతుడి కుమారుడు ప్రవీణ్ తెలిపారు. తన తండ్రి మరణానికి బెస్త సంఘానికి చెందిన ఓ వ్యక్తిపై అనుమానం ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా భిక్షపతి మృతదేహాన్ని పంచనామా చేయకుండా తరలించడంతో ఎస్సైపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సీఐ తిరుపయ్య ఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను సముదాయించారు. ఎస్సై తీరుపై ఉన్నతాధికారులకు విన్నవిస్తానని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు శాంతించారు.

చికిత్స పొందుతూ యువకుడు..



మహేష్(ఫైల్)

లింగంపేట/నాగిరెడ్డిపేట: మండలంలోని మాలపాటి గ్రామానికి చెందిన కంపె మహేష్(17) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మహేష్ ఈ నెల 12న నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట గ్రామం వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా మరో బైక్ ఢీకొంది. మహేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో కోమాలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మహేష్ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

రైలు నుంచి పడి ఒకరు..

ఖలీల్‌వాడి: డిచ్‌పల్లి మండలంలోని బర్ధిపూర్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి(35) రైలు నుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై ప్రణయ్ తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో మేకల మృతి



ధర్పల్లి(ఇందల్వాయి): కుక్కల దాడిలో నాలుగు మేకల మృతి చెందిన ఘటన ఇందల్వాయి మండలం దేవి తండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన డేగావత్ శంకర్ తన ఇంటి బయట మేకలను కట్టేసి ఉంచాడు. ఆదివారం రాత్రి మేకలపై వీధి కుక్కలు దాడి చేయడంతో నాలుగు మేకలు చనిపోయాయి. తండాలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని అధికారులు చర్యలు చేపట్టాలని బాధితుడు శంకర్ కోరారు.

యాసిడ్ తాగి ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని కోటగల్లిలో గంగాధర్ (49) యాసిడ్ తాగి మృతిచెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. రెండు రోజుల కిందట ఇంటి వద్ద యాసిడ్ తాగడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతు మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంటి వద్ద గుమిగూడిన జనం

మాక్లూర్: మండలంలోని చిక్లీ గ్రామంలో తాళం వేసిన ఓ ఇంట్లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై యాదగిరిగౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొట్టాల లక్ష్మి ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. అదే గ్రామానికి చెందిన ఆమె సమీప బంధువు మృతి చెందడంతో ఇంటికి తాళం వేసి వారింటికి వెళ్లింది. సోమవారం అంత్యక్రియల అనంతరం ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి చూడగా బీరువా తాళం పగులగొట్టి ఉంది. అందులోని 15 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ నరహరి ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ నెల 21న బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండటంతో అక్కడికి వెళ్లడానికి లాకర్‌లో పెట్టిన బంగారాన్ని శనివారం తెచ్చినట్లు బాధితురాలు తెలిపింది.